# ప్రశ్నించే గొంతుకకు పట్టంకడుదాం

**వినోదన్న గెలిస్తేనే తెలంగాణ ఆత్మగౌరవం**

- ఏ పార్టీ అధికారంలో ఉన్నా కొట్లాడి నిధులు తెస్తడు
- ఒక్కసారి ఎంపీగా ఉండి అనేక నిధులు తెచ్చిండు
- మరోసారి గెలిస్తేనే కరీంనగర్ మరింత అభివృద్ధి
- బండి సంజయ్ ఎంపీగా ఏం చేసిండు?
- కాంగ్రెస్ టికెట్ ఇప్పటి వరకు ఎందుకు డిక్లేర్ చేయలేదు
- బలహీనమైన అభ్యర్థిని పెట్టే ప్రయత్నంలో ఆ పార్టీ
- కరీంనగర్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కార్నర్ మీటింగ్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నగరప్రజలు
- పాల్గొన్న ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా బోయినపల్లి వినోద్‌కుమార్ గెలిస్తేనే తెలంగాణ ఆత్మగౌరవం నిలబడుతుంది. పార్లమెంట్‌లో ప్రశ్నించే ఆ గొంతుకకు పట్టం కడుదాం. ఆయన విజయం సాధిస్తేనే కరీంనగర్ మరింత అభివృద్ధి చెందుతుంది. కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా కొట్లాడి నిధులు తెస్తడు. ఒక్కసారి ఎంపీగా ఉన్నప్పుడే అనేక నిధులు తెచ్చిండు. మరోసారి గెలిస్తే మరింత అభివృద్ధి చేస్తడు. కరీంనగర్‌లో వినోద్‌కుమార్ గెలవకుండా చేసేందుకు కాంగ్రెస్ బలహీనమైన అభ్యర్థిని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నది. అందుకే ఇప్పటి వరకు ఈ సీటుకు అభ్యర్థిని డిక్లేర్ చేయలేదు. అనేక స్థానాల్లో మాదిరిగానే ఇక్కడ కూడా బీజేపీని గెలిపించే ప్రయత్నాల్లో ఉన్నది.

**- కార్నర్ మీటింగ్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**



విజయచిహ్నం చూపుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ సునీల్‌రావు



కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన నగరవాసులు, నాయకులు

కరీంనగర్, ఏప్రిల్ 12(నమస్తే తెలంగాణ)/ కార్పొరేషన్ : ప్రశ్నించే గొంతు వినోద్‌కుమార్‌ను గెలిపించుకుంటేనే కరీంనగర్ మరింత అభివృద్ధి చెందుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. మరోసారి ఎంపీగా గెలిస్తే పార్లమెంట్‌లో ఆయన, అసెంబ్లీలో గంగుల కమలాకర్ కరీంనగర్ వాణిని వినిపించి నిధులు సాధిస్తారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై కరీంనగర్‌లో వినోద్‌కుమార్‌ను ఓడించాలని చీకటి ఒప్పందాలు చేసుకున్నాయని, అందుకే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడంలో తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. శుక్రవారం రాత్రి కరీంనగర్‌లోని మంకమ్మతోటలో భారీ ర్యాలీ తీసి, రాంనగర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, మేయర్ వై సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్‌తో కలిసి ఆయన మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు నగర ప్రజలు బ్రహ్మరథం పట్టగా, మంకమ్మతోట నుంచి రాంనగర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ తీశారు. దారిపొడవునా నినాదాలు, నృత్యం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ప్రసంగించారు. వినోద్‌కుమార్ మొదటిసారి గెలిచినప్పుడు పార్లమెంట్‌లో తెలంగాణ కోసం పోరాడి అన్ని పార్టీల మద్దతు కూడగట్టారని హరీశ్‌రావు గుర్తు చేశారు. రెండోసారి కరీంనగర్ నుంచి గెలిచినప్పుడు ఒక్క కరీంనగర్ కోసమే కాకుండా తెలంగాణ హక్కుల కోసం పార్లమెంట్‌లో గళమెత్తారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు సాధించారని చెప్పారు. 2014లో కరీంనగర్ ఎంపీగా గెలిచినప్పుడు కొత్తపల్లి -మనోహరాబాద్ రైల్వే లైన్ సాధించారని, పలు జాతీయ రహదారులకు నిధులు తెచ్చారని వివరించారు. అర్హత లేకున్నా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కరీంనగర్‌కు స్మార్ట్ సిటీలో స్థానం కల్పించారని, రూ.వెయ్యి కోట్లు సాధించి రాష్ట్రంలోనే కరీంనగర్‌ను రెండో నగరంగా అభివృద్ధి చేశారని తెలిపారు. తాను చిన్నతనంలో ఇక్కడే ఉండి చదువుకున్నానని, అప్పటి కరీంనగర్‌కు ఇప్పటికి ఎంతో వ్యత్యాసం ఉన్నదని అన్నారు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం వద్ద అనేక పనులను ప్రతిపాదించారని, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ వాటిని సాధించలేక పోయారన్నారు. ఇప్పుడు వినోద్‌కుమార్‌ను గెలిపించుకుంటే ఈ పనులన్నీ సాధించి పెడతారని హామీ ఇచ్చారు. పేదల కోసం పథకాలు తేవాలని కోరితే ఇక్కడి ఎంపీ బండి సంజయ్ మాత్రం ఇంటింటికీ చిత్ర పటాలు పంపిణీ చేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం, కరీంనగర్ అభివృద్ధి కోసం వినోద్‌కుమార్ 106 సార్లు పార్లమెంట్‌లో తన గొంతు వినిపించి అనేక నిధులు సాధించారని, ఇప్పటి ఎంపీ సంజయ్ ఎన్నడన్నా ఆయన హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాట్లాడారా? అని ప్రశ్నించారు. అటు పార్లమెంట్‌లో ఇటు అసెంబ్లీలో జై తెలంగాణ అనేది కేవలం బీఆర్‌ఎస్ పార్టీనే అని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి ఏనాడన్నా జై తెలంగాణ అన్నాడా? అని ప్రశ్నించిన హరీశ్‌రావు ఉద్యమ సమయంలో తుపాకీ పట్టుకుని కరీంనగర్ మీటింగ్‌కు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎవడురా తెలంగాణ అనేదని తొడగొట్టిన వ్యక్తి దురదృష్టవశాత్తు సీఎం అయ్యారని తెలిపారు. డిసెంబర్ 7న ప్రమాణ స్వీకారం చేసినప్పుడే అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చురకలు పెట్టాలని, లేదంటే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయకున్నా తమకు ప్రజలు ఓటు వేశారని, వాటిని అమలు చేయకుండానే కాలం గడిపేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, వీర్ల వెంకటేశ్వర్‌రావు, నగర డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, నగర కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీవి పచ్చి అబద్ధాలు

నేను ఎంపీగా తెలంగాణ ఉద్యమంలో నావంతు పాత్ర పోషించా. అర్హత లేకున్నా కొట్లాడి కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా తీసుకువచ్చి ₹వెయ్యి కోట్లు మంజూరు చేయించా. ఇప్పటికే ₹700 కోట్ల మేరకు పనులు సాగుతున్నాయి. ఇంకా పనులు జరగాల్సి ఉన్నది. నేను కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ తెచ్చేందుకు ఎంతో కృషి చేస్తే.. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ పూర్తిగా మరిచిపోయారు. మేమెప్పుడూ కరీంనగర్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్దాలని ఆలోచనలు చేశాం. జాతీయ రహదారులు, రైల్వే లైన్లు తీసుకువచ్చాం. సంజయ్ కరీంనగర్ అభివృద్ధి కోసం ఆరాటపడ్డారా..? ఉంటే నిరూపించాలి. చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తెచ్చి చూపాలి. కానీ, ఆయనకు కరీంనగర్ అభివృద్ధిపై సంజయ్‌కి ఇసుమంత కూడా ఆలోచన లేదు. కేవలం రాజ్యాధికారం ఆలోచనే ఉన్నది. ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోతే పునరావాస కేంద్రంగా ఎంపీగా పోటీ చేస్తారా..? సంజయ్ ఒక బడి, గుడి తీసుకురాలేదు. కానీ, నేను ఓడిపోయినా నగరానికి టీటీడీ నుంచి ₹50 కోట్లతో వేంకటేశ్వర, ఇస్కాన్ దేవాలయాలను తీసుకువచ్చా. కొండగట్టు కోసం 333 ఎకరాలను ప్రభుత్వం నుంచి కేటాయించే విధంగా కృషి చేశాం. బీజేపీ నాయకులు ఎంతసేపూ పచ్చి అబద్ధాలతో కాలం గడుపుతున్నారు. తీగలగుట్టపల్లి వద్ద ఆర్వోబీని మంజూరు చేసేందుకు మేమే కృషి చేశాం. పార్లమెంట్ ఎన్నికల్లో నన్ను గెలిపించండి. కరీంనగర్‌కు అంతర్జాతీయ సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను తీసుకువచ్చేందుకు కృషి చేస్తా.



**- బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి**



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు

## నాలుగు నెలల్లోనే ఆగమాగం



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఆగమాగం చేస్తున్నది. కేసీఆర్ పాలనలో కరీంనగర్‌ను రాష్ట్రంలోనే రెండో గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేశాం. అర్హత లేకున్నా కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా తీసుకువచ్చిన ఘనత వినోద్‌కుమార్‌దే. రూ.వేల కోట్లతో నగరంలో చేపట్టిన అభివృద్ధి ప్రజలకు కనిపిస్తున్నది. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా ప్రశ్నించే గొంతుక ఉంటేనే నిధులు వచ్చే అవకాశం ఉంటుంది. పదేళ్లలో నేను ఎమ్మెల్యేగా, ఎంపీగా వినోద్‌కుమార్ సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ కోసం ప్రశ్నించే అవకాశం లేదు. తెలంగాణ సంక్షేమం కోసం ప్రశ్నించేది ఒక్క బీఆర్‌ఎస్ మాత్రమే. కేసీఆర్ పాలనలో ఏ రోజైనా మహిళలు నీళ్ల కోసం రోడ్లపైకి వచ్చిన దాఖలాలు ఉన్నాయా..? కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలోనే సాగు, తాగునీటి కోసం రోడ్లెక్కే దుస్థితి వచ్చింది. బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రజల్ని ఓట్లు అడిగే హక్కు లేదు. వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే నగరాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన కనిపిస్తున్నది.

**- గంగుల కమలాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే**



పెద్దపల్లి జెండా చౌరస్తాలోని దుకాణ సముదాయాల్లో ఓట్లు అభ్యర్థిస్తున్న కొప్పుల ఈశ్వర్, పక్కన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

# కన్నీళ్లు మిగిల్చిన కాంగ్రెస్ పాలన

- రైతులను గాలికొదిలి రాజకీయాలకు ప్రాధాన్యం
- పాలన మరిచి కేసీఆర్ ప్రభుత్వంపై నిందలు
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ధ్వజం
- ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తానని ప్రజలకు విజ్ఞప్తి
- పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో విస్తృత ప్రచారం

పెద్దపల్లి/ సుల్తానాబాద్ ఏప్రిల్ 12: ఓ వైపు సాగునీరులేక పంటలు ఎండిపోయి, మరోవైపు అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట దెబ్బతిని రైతులు కన్నీళ్లు పెడుతుంటే కాంగ్రెస్ సర్కారు కనికరించడంలేదని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను గాలికొదిలి రాజకీయాలకు ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం ఆయన పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి సుల్తానాబాద్, పెద్దపల్లిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఉదయం సుల్తానాబాద్‌లో వాకర్లతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. మార్కెట్‌కు వెళ్లి వ్యాపారులు, వినియోగదారులను ఓట్లడిగారు. అనంతరం పెద్దపల్లి జెండా చౌరస్తాలోని దుకాణాసముదాయాల్లో వ్యాపారులు, ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయాచోట్ల మాట్లాడారు.రేవంత్‌రెడ్డి సీఎం హోదాను మరిచి ప్రతిపక్ష నాయకుడిలా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని పక్కనబెట్టి గత ప్రభుత్వాన్ని నిందించడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ముస్లింల అత్యంత పవిత్ర రంజాన్ పండుగకు తోఫా కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికల ముందర ఇచ్చిన హామీ మేరకు వడ్లకు ₹500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, అన్ని వర్గాలను సమన్యాయం చేశారని గుర్తు చేశారు. తాను కార్మిక కుటుంబానికి చెందిన వాడనని, ఒకసారి ఆదరించి ఆశీర్వదిస్తే పెద్దపల్లి పార్లమెంట్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ చేశారు. మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టే కాంగ్రెస్, బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్, పొన్నమనేని బాలాజీరావు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, నాయకులు దాసరి ఉష, మార్కు లక్ష్మణ్, కొయ్యడ సతీశ్, ఎన్ సరేశ్, కార్తీక్, తబ్రేజ్, బెక్కం ప్రశాంత్, చంద్రమౌళి, ఫహీం, శ్రీకాంత్, అయిల రమేశ్, పురం ప్రేమ్‌చందర్‌రావు, బుర్ర శ్రీనివాస్, దీకొండ భూమేశ్, శీలం శంకర్, ఫకీర్‌యాదవ్, కౌన్సిలర్లు, కూకట్ల గోపి, అనుమాల అరుణబాపురావు, రెవెల్లి తిరుపతి, గుర్రాల శ్రీనివాస్, బోయిని రాజమల్లయ్య, జూపెల్లి సందీప్‌రావు, గోట్టం మహేశ్, రఫీక్, పెగడ పరుశరామ్, బండి సంపత్ ఉన్నారు.



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కార్గిల్ లేక్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

# 27రోజులు.. ₹54.78 లక్షలు

- లోక్‌సభ ఎన్నికల వేళ సిరిసిల్లలో భారీగా నగదు పట్టివేత
- ₹6.71లక్షల విలువైన మద్యం సీజ్
- అనుమానిత బ్యాంకు లావాదేవీలపైనా నిఘా

**లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో రాత్రింబవళ్లు ముమ్మురంగా తనిఖీలు చేపట్టింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన గత నెల 16 నుంచి ఇప్పటి వరకు అంటే 27 రోజుల్లో ₹54.78 లక్షల నగదు, ₹6.71 లక్షల విలువైన మద్యాన్ని పట్టుకొని సీజ్ చేసింది.**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల వేళ కోడ్ అమల్లో ఉంటుంది. ఈ సమయంలో ₹50 వేలకు మించి నగదు తీసుకెళ్తే అందుకు సంబంధించిన పత్రాలు చూపించాల్సి ఉంటుంది. అయితే, ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తరలిస్తే పోలీసులు పట్టుకొని సీజ్ చేసే అధికారముంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియామవళిని పకడ్బందీగా అమలు చేస్తుండగా.. ఒక్క సిరిసిల్ల జిల్లాలోనే గురువారం వరకు ₹54.78 లక్షల నగదు పట్టుపడ్డది. సరైన పత్రాలు చూపించకపోవడంతో అధికారులు సీజ్ చేశారు. అలాగే గ్రామాల్లోని బెల్టుషాపులపై నిఘా తీవ్రతరం చేశారు. ₹6.71 లక్షల విలువైన మద్యాన్ని సీజ్ చేశారు. 192 కేసుల్లో 451 మందిని బైండోవర్ చేయగా, 514 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. కాగా, ఇతర జిల్లాలకు దొంగచాటుగా తరలిస్తున్న 4.9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎన్నికల వేళ ఓటర్లను నగదు, మద్యం ఇతర వస్తువులను ఇచ్చి ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉన్నందున తనిఖీలు ముమ్మరం చేశారు. మరోవైపు అనుమానిత బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించారు. గూగుల్, ఫోన్‌పే నుంచి ట్రాన్స్‌ఫర్ అయ్యే ఖాతాల వివరాలపై నిఘా తీవ్రం చేశారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, మద్యం ఇతరత్రా సమాచారం, ఫిర్యాదు చేసేందుకు సిరిసిల్ల 1950 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేసేందుకు సీ వీజిల్ యాప్ అమల్లోకి తెచ్చారు. ప్రత్యేక సిబ్బంది నిరంతరం పర్యటిస్తూ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై కేసులు నమోదు చేస్తున్నారు.

# ఓటు నమోదుకు మూడు రోజులే గడువు

**ఈ నెల 15న ముగియనున్న ప్రక్రియ**




కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 12: ఓటు నమోదుకు మరో మూడు రోజులే గడువు ఉన్నది. ఈ నెల 15న ప్రక్రియ ముగియనున్నది. అర్హులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న ఓటరు నమోదు ద్వారా ఇప్పటికే జిల్లా ఎన్నికల యంత్రాంగానికి 8 వేలకు పైగా ఫాం-6 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తున్నది. తుదిగడువు వరకు ఆన్‌లైన్‌లోగానీ, ఆఫ్‌లైన్‌లో గానీ స్వీకరించి, అనంతరం వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఈనెల 25న తుది జాబితాను ప్రకటించనున్నారు. ఇప్పటికే ఫిబ్రవరి 8న లోక్‌సభ ఎన్నికల ఓటర్ల తుది జాబితా విడుదల కాగా, కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 10,71,792 మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా ఇచ్చిన అవకాశంతో మరో పది వేల మంది వరకు పెరుగుతారనే ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. ఓటరు నమోదుకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో స్వీప్ ద్వారా పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో, విద్యార్థుల్లో భారీ ఎత్తున స్పందన వచ్చిందని చెబుతున్నారు. 2006 మార్చి31 లోగా జన్మించిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కు పొందాలని, ఫాం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కే మహేశ్వర్ చెప్పారు. వయసు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటో జత చేసి సమీపంలోని పోలింగ్ స్టేషన్ బూత్ స్థాయి అధికారికి అందించాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి, ఇక్కడే స్థిరపడ్డ వారు కూడా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓట్లు గల్లంతైనవారు వారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు.



మత్తు పదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ, అధికారులు

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**రామగుండం సీపీ ఎం శ్రీనివాస్**

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 12: యువత గంజాయికి బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. గంజాయి వినియోగం, కల్తీకల్లు తాగడం వల్ల కలిగే అనర్థాలపై రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ ఆవిష్కరించి మాట్లాడారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. వాటి విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు. గంజాయి రహిత కమిషనరేట్ కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సీపీ సూచించారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి తదితరులు ఉన్నారు.